శ్రీ మల్లాది విశ్వనాథ కవిరాజు గారి నాటకం "దొంగాటకం" పూర్తి పాఠం ఈ క్రింద చూడవచ్చు......

వీరిదే - "నాటికి నేడు" రేడియో నాటకం, డాక్టర్ కె.బి.గోపాలం గారి సౌజన్యంతో వెబ్సైటులో ఆకాశవాణి కార్యక్రమాలు --> నాటికలు సెక్షన్లో పబ్లిష్ చెయ్యటం జరిగింది...

ఈ "దొంగాటకం" నాటకం - 1976 తెలుగువాణి పత్రిక (వాల్యూం 1, నంబర్ 3, సెప్టెంబర్ 15వ తారీకు సంచిక) లో ప్రచురితం

కాపీరైటు హక్కుల ఉల్లంఘన ఉద్దేశమేదీ లేదని సవినయంగా విన్నవించుకుంటూ....

భవదీయుడు

వంశీ


http://www.maganti.org/

విశ్వనాథ కవిరాజు

*(1900 - 1947)*

మల్లాది విశ్వనాథ శర్మ, కవిరాజు కామకోటి పీఠాధిపతుల ప్రశంస, విజయనగరం మహారాజ కళాశాలలో తెలుగు పండితులుగా పని చేశారు అనేక హాస్య ఏకాంకికలు వ్రాశారు కొన్ని సినిమాలకు రచన చేశారు

'దొంగాటకం' హిందీ, వంగ భాషలలోకి అనువదింపబడింది



# దొంగాటకం

[రాత్రి 10 30 గం॥ రాజ్యం తమలపాకులు చిలకలు చుడుతూంది 22 సం॥ కొంచెం పెద్ద నుదురు, సోగకళ్లు చిఱుతవాటు మొఖం - తెలివితేటలున్నట్లే కనబడుతుంది ప్రకాశం 30 సం॥ ఒడ్డూ పొడవూ, మంచి బందోబస్తుమనిషి మాట కూడా గంభీరముగానే వుంటుంది నిక్కరు, స్వెట్టరు వేసుకొన్నాడు వెట్‌ఫ్రేమ్ స్పెక్టికల్సు, రిష్టువాచి, థెర్మోఫ్లాస్కు మెళో, చేతులలో బేటరీలైటు స్లిప్పర్సు వదలి జోళ్లు తొడుగుతూ]

ప్రకా : అప్పుడు పంపు కొట్టాడా సైకిల్‌కి ?

రాజ్యం : ఆ !

ప్రకా : కేసులో పెట్టావా సిగరేట్సు ?

రాజ్యం : లేదు

ప్రకా : ఇంకా కిల్లీలు కట్టలేదు కదూ !

రాజ్యం : ఎన్ని ?

ప్రకా : రోజూ చెప్పవలెనేమో ! అరడజను. అప్పుడే 10 40

రాజ్యం : అంటే యీవాళకూడా పెట్రోలింగుకి బయలుదేరుతూన్నారన్నమాట

ప్రకా : ఆ వాడీవూళ్లో గలాటా చేస్తూండే వరకూ, లేకుంటే వాడుపట్టుబడేవరకూ మనకీపనితప్పదు

రాజ్యం : ఏం పోలీసులు లేరూ, నెలకు బోలెడేసి జీతాలు తీస్తూ ? మీరు ఎందుకింత శ్రమపడడం ?

ప్రకా : వాళ్లు దొంగ దొరికిన తర్వాతనే కనబడతారు పట్టివ్వడం మన బాధ్యతే కొట్టులో పెట్టడం మాత్రం వాళ్ల పని

రాజ్యం : మరి వూళ్లో యిందరు వస్తాదులూ, తాలెంఖానావాళ్లు ఉన్నారు !

ప్రకా : వున్నారు ! వాళ్లు మరో వస్తాదు వచ్చి బస్తీ మీద సవాలు కొడితేనే పైకి వస్తారు రాజ్యం ! ఎంతో ధైర్య సాహసాలుంటేనే కాని మనిషి యింతపనికి పూనుకోలేడనుకో దొంగతనానికి వచ్చినవాడు అన్నిటికి సమస్త తెగతెంపులూ చేసుకునే వస్తాడు వాణ్ణి ఎదిరించడమంటే సామాన్యమైన పనిగాదు మనమూ ప్రాణాలకి తెగించాలి

రాజ్యం : అయితే యెవ్వరికీ లేనిది మనకెందుకీ ఘోర సాహసం ? పుణ్యమా, పురుషార్థమా ?

ప్రకా : కీర్తి, పేరు, ప్రతిష్టలు ! యిప్పటికే వూళ్లో నా పేరు ఆ దొంగపేరుకంటే ఎక్కువగా మ్రోగిపోతున్నది ఇది వరకు నాతో పరిచయంలేని పెద్దమనుష్యులెందరో నాకీ మూలాన స్నేహితులైనారు ఎంతో మంది బి యే స్టూడెంట్సు మొదలైనవాళ్లు కూడా నావెంట వస్తూ నా చెప్పుచేతలలో తిరుగుతున్నారు ఇంకేం కావాలి చెప్పు ?

రాజ్యం : బాగానే వుందిగాని మనకేదైనా ప్రమాదం వస్తే ఈ స్నేహాలు రక్షిస్తవా ?

ప్రకా : నాకే ప్రమాదం రాదనే ధీమా నాకున్నది నా బాకు నాదగ్గరవుంటే చాలు

రాజ్యం : ఆ దొంగ రివాల్వర్ పట్టుక వుంటాడేమో !

ప్రకా : రివాల్వర్ ఎదురుగుండా వుంటేనే పేలుస్తుంది బాకు వెనక నుంచి పొడుస్తుంది

రాజ్యం : ఒకరి ప్రాణం తీసివేస్తే గవర్నమెంటు వారు వూరుకుంటారా ?

ప్రకా : ఆత్మ సంరక్షణార్థం చంపామంటే తప్పకుండా వూరుకుంటారు అందులో యిటువంటి గజదొంగను చంపామంటే ప్రజంటు గూడా యిస్తారు అసలు యిటువంటి సాహసం చేసినవాళ్లనే డిటెక్టివుగా వేస్తారు

రాజ్యం : ఏది ఎలాగైన పెట్రోలింగ్‌కు వెళ్లడం నాకిష్టంలేదు

ప్రకా : ఇది బాగుంది, రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది అని అడిగిందట - ఏమిటే నీకు భయం ?

రాజ్యం : నా కంతా భయమే మిమ్ములను గురించి - నన్ను గురించి కూడా ఆ దొంగ వెధవ ఎవడో పెళ్లాం పిల్లలు లేని దిక్కుమాలిన ముండాకొడుకు అన్నిటికి తెగించి వస్తాడు - వాడి చేతుల్లో మీరు దొరుక్కుంటే ఇంకేమైన వుందీ ? మీరు వూళ్లో పెట్రోలింగ్‌కు వెళ్లిన తరువాత వాడు మన యింట్లోనే ప్రవేశించితే - నా ప్రాణాలు ఉన్నవి ఉన్నట్లు లేచిపోవూ ? మనకిపుడున్న కీర్తిచాలు మీరు వెళ్లనేవద్దు

ప్రకా : నేను వెళ్లకుండా ఇంట్లో కూర్చుంటే తక్కినవాళ్లందరు వచ్చి మన యింటిమీద పడి నన్ను బయటకు లాగుతారు

రాజ్యం : జ్వరం వచ్చినదని చెప్పి కప్పుకొని పండుకోండి

ప్రకా : ఎన్నాళ్లని పండుకొంటాను ? నాకీ అబద్ధాలు, పిరికి చేష్టలు నచ్చవు సుమా ! దేవుడు నన్ను మగాణ్ణి చేశాడు నేను మగవాడుగానే వుండవలె

రాజ్యం : కానీ దేవుడు నన్ను ఆడదానిగా చేశాడు కదూ ? నా పిరికితనం ఎలాగు పోతుంది ? తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డబేరం వుండవు ఇంటగెల్చి రచ్చ గెలువు అన్నారు మొదట స్వవిషయం చూసుకోండి

ప్రకా : వీలు లేదు. నాకు స్వవిషయం కంటె లోక విషయమే ముఖ్యం 10.55 అయింది ఇంక వెళ్లాలి ఆకిల్లీలు, జాకు, అందుకో

రాజ్యం : మీరు లక్ష చెప్పండి – నేను ఒప్పను అదేమో ఏ రోజుకంటె ఈవేళ మరీ భయంగా వుంది. మీరు సినిమా నుంచి ఒక గంట రావడం ఆలస్యమయేసరికి నేను వెఱ్ఱి ఎత్తిపోయినాను

ప్రకా : ఇంక నీ కింటి దగ్గర కాపలా కూర్చుని నేనపకీర్తి పాలు కావలెనా ?

రాజ్యం : కీర్తో, అపకీర్తో ! అర్ధరాత్రివేళ నే నొకతిని యింట్లో వుండలేను

ప్రకా : ఇల్లు యినప పెట్టెలాగా వుంది

రాజ్యం : కానీ నా మనస్సు ? ఆ వేషమంతా విప్పండి ఇవిగో రెండు కిళ్లీలు కట్టాను ఇవి చాలు లెండి , గడచిన 10–15 రాత్రులు, నిద్ర లేనేలేదు ఈ రాత్రేనా సుఖంగా నిద్రపొండి

ప్రకా : ఆ దొంగ వెధవ యీ ఊళ్లో తిరుగుతున్నంతవరకు నాకు ఇంట్లో పండుకున్నా నిద్రపట్టదు

రాజ్యం : లేకుంటే జబ్బు చేస్తుంది.

ప్రకా : నీ ధర్మమా అని అది మాత్రం తెచ్చిపెట్టకు దైవ కృపవల్ల నా శరీరము వుక్కు తునక వజ్రపు ముక్క

రాజ్యం : కానీ మానవ శరీరం – విధిగా విశ్రాంతి కావలె,

ప్రకా : అవును, ఏవో మాటల్లో పెట్టి నన్నిలాగు నిలబెట్టేస్తే ఎలా ?

రాజ్యం : మీరు ఈ రాత్రి గడపదాటి ఆవలకు వెళ్లితే నే ఒప్పనండి. కావలిస్తే రేపు వుదయం నన్ను మా పుట్టింటికి పంపించివేసి మీరు—

ప్రకా : అవును గాని ఏమిటీ మొండితనం ? నీమాటే నీదా ?

రాజ్యం : మొండితనం అనండి – గయ్యాళితనం అనండి నా భయం తీర్చమని నా భర్తను కోరడం తప్పుకాదు కదా నా మనస్సు భయంచేత ఏలాగు గడ్డకట్టిపోయి వుందో మీకేమి తెలుసు?

||

మీకున్న ధైర్యసాహసాలు లోకములో అందరికి - స్త్రీలకి, బాలురకు సహా-వుంటాయను కోవడం మీ తప్పు.

(లోపల నుండి)

మిస్టరు షెర్లాక్ హోమ్స్!

ప్రకా : రైటో-కమింగ్.

రాజ్యం : మీరు మాత్రం వెళ్లితే నేను ఒప్పను సుమండీ. తరువాత నన్ను అని లాభంలేదు. వాళ్ల కేదో చెప్పి పంపించేసి రండి. ఈ వేషమంతా విప్పండి. (తానే విప్పి) ఈ శాలువ కప్పుకొని వెళ్లి జ్వరం అని చెప్పి చక్కారండి. (తానే శాలువ కప్పుతుంది)

ప్రకా : మన దేశంలో పురుషుల ధైర్య సాహసాలు చావడానికి స్త్రీలే కారణమని యిప్పుడు తెలిసింది. షేమ్, షేమ్ (వెళతాడు)

రాజ్యం : (వస్తువులు సర్ది ప్రక్కలు రెండు మంచాలపై పరచి నడుమ ఈజీచైరువేసి, ఇంకేవేవో సవరిస్తూ వుంటుంది)

ప్రకా : (వచ్చి) ఛా, ఛా, ఛా! నా వుత్సాహమంతా ధ్వంసం చేశావు. నాచేత అబద్ధ మాడించావు. వాళ్లను పంపించి వేశాను ఇంకేం చేసేది? (మంచముమీద కూలబడతాడు)

రాజ్యం : ఆ పాపమంతా నాదేలెండీ. కాని వాళ్లు పోయారూ?

ప్రకా : ఆ. ఏమైనా అంత అవసరమైతే సైకిలుమీద కబురెట్టమన్నా.

రాజ్యం : నిన్నరాత్రి ఏమి లేదటకదూ?

ప్రకా : లేకపోవడ మేం? నిన్న రాత్రి ఘోరం జరిగింది నిన్న 1 గంటకి దొంగ ఒకడు కోమటి వీధిలో పడ్డాడట ఒక కోమటి - తన కొడుకు, ఇంకా ఎవరో ముగ్గురు ఒక గదిలో గడియ వేసుకొని పడుకొన్నారట ఎలాగొచ్చాడో ఆ గదిలోకొచ్చి కోమటి తలకాయ మీదికెత్తి తాళాలు ఏవి అన్నాడట దానితో ఆ కోమటి గగ్గోలెత్తిపోయి నోటమాటరాక, చేతకాని ముండాకొడుకై పోయినాడు - లేకుంటే తాళాలు కావాలిరా స్కౌండ్రల్ అని గూబ పగలెయ్యవలసింది

రాజ్యం : అయితే ఏమైంది తుదకి?

ప్రకా : వేటగాడు మెత్తనైతే లేడి మూడుకాళ్లతో నడుస్తుంది, దానితో ఆ దొంగ వాడి పీక పట్టుకొని - నోట్లో గుడ్డ కుక్కి -

రాజ్యం : అబ్బా - చెప్పకండి నాకు భయంవేస్తోంది ఈవాళ సినిమా కథ చెప్పండి

ప్రకా : ''ముసుగుదొంగ'' - అదీ దొంగ కథే

రాజ్యం : ఆకథా వద్దు సినిమాలోను దొంగలే! వూళ్లోను దొంగలే మరేదైనా మంచికథ చెప్పండి

ప్రకా : $11\frac{1}{2}$ అయింది, యిప్పుడు కథ ఏమిటిగానీ పెరటి తలుపులన్నీ దిట్టముగా వేశావా ?

రాజ్యం : వేశాను నాకంతకంటే భయం. మీరా దొంగ నెప్పుడైనా చూశారూ ?

ప్రకా : చూస్తే విడిచి పెడతానూ ? చూడకపోయినా విన్నదాన్ని బట్టి పోల్చగలనులే వీడు అంతా సినిమా దొంగలాగు తయారవుతాడట తలమీద పెద్ద విగ్ ఒకటి ఎవడో తజుట్టు పట్టుకొనేసరికి అది వాడి చేతుల్లో వుండిపోయిందట - వీడు పారిపోయినాడట వీడు లోపల ఇనపతీగెల బనీను తొడుగుకుంటాడట నేనూ ఒకటి కొందామని చూస్తున్నా ఒక పోలీసు వాడు కత్తితో పొడిస్తే- దెబ్బ తగలలేదట చేతిలో టార్చిలైటు ఒకటి – ఒక చేతిలో రివాల్వరు - మామూలుగా కత్తి మొల్లో వుంటుందట - బాకు ఒకటి - మెళ్లో నాలాగే కాఫీ థెర్మాసుఫ్లాస్కు వుంటుందట -

రాజ్యం : మరి ఆ సంగతి చెప్పకండి నే నొకటి అడుగుతాను చేస్తారు కదూ ?

ప్రకా : ఏమిటి కథా ?

రాజ్యం : మీకు పండుకోవడమే నిద్ర వస్తుంది నాకు రాదు, అందుచేత నేను ముందర పడుకొంటాను. మీరు ఏదైనా చదువుతూండండి నేను నిద్రపోతాను తరువాత మీరు నిద్రపోదురుగాని

ప్రకా : ఏం చదివేది ? ఇంగ్లీషు పుస్తకాలు నీకు అర్థంకావు వెధవ తెలుగు అంటే నాకు అసహ్యం.

రాజ్యం : పోనీ ఇంగ్లీషు పుస్తకమే చదివి తెలుగున చెప్పుదురూ

ప్రకా : (లేచి వెళ్లి పుస్తకము తెచ్చి) ఇదిగో "మార్కండేయ" అని ఇది చాలా మంచి పుస్తకం దీనిని నాన్ డిటియల్ డు అంటారు (చదివి చెప్పుతూ) అప్పుడే నిద్ర పట్టింది (పుస్తకము మూసి ఈజీ చైరు ఎత్తి పెట్టి తానూ పండుకొంటాడు)

రాజ్యం : దీపం తగ్గించేస్తురూ , అమ్మమ్మ !

ప్రకా : ఇంకా నిద్రపట్టలేదూ ? (తగ్గించి పండుకొంటాడు) (పెరటిలో పెద్ద చప్పుడు)

రాజ్యం : (దిగ్గున లేచి) అమ్మో ఏమిటిది ? ఎంత చప్పుడో!?

ప్రకా : ఏమిటి చెప్మా !

రాజ్యం : దొంగ ! తప్పకుండా దొంగ ! నిస్సందేహం !

ప్రకా : వుండు, క్షణముండు (జాగ్రత్తగా విని) యిప్పుడు ఏం చేయడం ?

రాజ్యం : కేకలు పెడదాం - దొంగ అని గట్టిగా ?

ప్రకా : నలుగురూ మూగి చూసిన తరువాత ఏ దొంగా లేకపోతే నాకు కమ్మకట్టివేయరూ ? చెప్తా (ఏదీ గతి నాకు – గ్రామఫోను రికార్డు వేస్తాడు )

రాజ్యం : (సగములో ఆపి) అవతల నుంచి కొంపమునిగిపోతూ వుంటే ఈ గ్రామఫోను వాయిద్యమేమిటి ? (తీసివేస్తుంది)

**ప్రకా :** వాడే దొంగ అయితే వాడికి మనం మేలుకొని వున్నట్లు తెలుస్తుంది.

**రాజ్యం :** అయితే ఈలాగు తెల్లవార్లూ గ్రామఫోనుతో కూర్చుందామంటారా ఏమిటి? ఛా, ఛా! పెరట్లో ఒక మారు చూచిరండి

**ప్రకా :** తలుపు తెరిచేసరికి వాడు లోపల ప్రవేశిస్తే?

**రాజ్యం :** అప్పుడే వెంటనే కేకలు పెడదాం!

**ప్రకా :** వుండు ముందర కిటికీ తెరచి చూద్దాం, (తెరుస్తాడు పిల్లి లోపలకు గెంతుతుంది) పిల్లి వెధవగొడ్డు!

**రాజ్యం :** బ్రతికేం భగవంతుడా! నా ప్రాణాలు మీదకెగిరి పోయినాయి

**ప్రకా .** రా అయినా ఓమారు పెరడు చూదాం

**రాజ్యం :** అమ్మో! నేను రావడమే! నేను రాలేను సుమండీ!

**ప్రకా :** దొంగా మనిషివంటివాడే! దొంగంటే యింత భయమైతే ఎలాగే? ఏదీ ఆ టార్చిలైటూ, బాకూ యిలాగ ఇయ్యి, నేను చూసివస్తా!

(తలుపు తెరిచి వెళతాడు రాజ్యం ముసుగు కప్పుకొని పండుకొంటుంది దొంగ మెల్లగా ప్రాకుకొని వచ్చి మంచము క్రిందకు పోతాడు)

**ప్రకా :** (తిరిగివచ్చి తలుపు గడియవేసుకొని) అప్పుడే ముసుగు తన్నేవా? ఏమి భయమే! ఆడవాళ్ల కింతలేసి ధైర్య సాహసాలు వీళ్లకు పురుషులతో సమాన స్వాతంత్ర్యం కావాలట! లే! ఏ దొంగా లేడు

**రాజ్యం :** (ముసుగుతీసి మంచంపై కూర్చొని) లేడూ లేడూ? బ్రతికేం

**ప్రకా :** మనం కాదు, వాడు బ్రతికాడు ఏ ముండాకొడుకుకు గుండెలున్నాయి మన యింటి రావడానికి?

(దొంగ గప్పున యిద్దరి ఎదుట నిలుస్తాడు)

**ఇద్దరు :** ఓ, ఓ, ఓ.. ............దొ......దొ......దొ......

**దొంగ** షటప్! (రివాల్వరు చూపించి) తల పేలుస్తా నోరు విప్పితే

**ప్రకా :** (ఒక చేత్తో తన నోరు మూసుకొని రెండవ చేత్తో గట్టిగా ఆమె నోరు మూస్తాడు)

**దొంగ :** నోరు మూసుకొని కప్పుకొని పండుకోమని చెప్పు

**ప్రకా :** పండుకో పండుకో మాటాడితే గట్టిగా ఊపిరితీస్తే ఈయన తల పేల్చేస్తానంటున్నారు లేకుంటే ఏమీ అనరట పండుకో (బలవంతంగా పండుకోబెట్టి శాలువ నిండా కప్పుతాడు)

**రాజ్యం :** అమ్మో దొంగ! దొంగ! (ముసుగులో మూల్గుతుంటుంది)

**ప్రకా :** ఎవరు దొంగ? ఆయన దొంగ అని అప్పుడే నీకేం తెలుసు?

రాజ్యం : భయం భయం, హా, హా, హా, హా (వణికిపోతుంది)

దొంగ : నోటిలో గుడ్డ కుక్కి ఈమె నోరు కట్టి వేయి కదలకూడదు

ప్రకా : ఈమె మలేరియా జ్వరంతో బాధపడుతోంది అందుచేతనే ఈ వణుకూ పలవరింతలూ మాటాడకు రాజ్యం ! (చెవిలో మెల్లగా) భయంలేదు నేనున్నాను నీవు హాయిగా పండుకో , పండుకుందండి.

దొంగ : ఆ రాకింగ్ చైర్ యిలాగు వెయ్యి

ప్రకా : తొందరలో గమనించలేదు పాపం యింత సేపు నిలబడిపోయినారు (చైరు వేసి) దయ చేయండి

దొంగ : (కూర్చుండి నోటుబుక్కు తీసి వ్రాసుకొంటూ) మీ పేర్లు ? మీ సంగతులు ?

ప్రకా : నా పేరు రాజ్యలక్ష్మి, దీని పేరు ప్రకాశరావు, వయస్సులు, 30-25, భార్యా భర్తలం కేస్టు హిందూస్ బ్రాహమిన్స్, ఇంటిపేరు ద్వివేదులవారు అన్నట్లు నేను మేల్, యిది ఫిమేలండి

దొంగ : నీ యింటి దగ్గర ఏమేమి ఆయుధాలున్నాయి ?

ప్రకా : మేమేమి రాజులం కనకనా ? సంసారులం బ్రాహ్మలం ఏ మాయుధాలు వుంటాయి ? కత్తిపీట - కోరాం - పారా - బారిగా - గునపాం -

దొంగ : అవికావు

ప్రకా : అయితే నా దగ్గర పెన్ నైఫ్-సేఫ్టీ రేజర్, సెల్ఫ్ షేవింగ్‌కు ఎడోనిస్ బ్లేడ్స్ ఒక డజన్. అంతే నా వైఫ్ దగ్గర కొన్ని, హెయిర్ పిన్స్ - చిన్న కత్తెర -

దొంగ : (విషపు నవ్వుతో) తమాషా ! ఆయుధము లేదా ?

ప్రకా : అన్నట్లు మరచాను ఒక్క చిన్న బాకున్నది (యిచ్చి) పనసకాయ కొట్టుకొందుకు మొన్ననే కొన్నాను అట్టే దారుగాలేదు వుండనివ్వండి

దొంగ : ఈ యిల్లు నీదేనా ?

ప్రకా : కాదండీ అద్దెకొంప, నెలకు 22 రూ అద్దె తమవంటి తగు మనుష్యులు వస్తే కూర్చో పెట్టడానికి మంచి గదైనా లేదండి

దొంగ : నీకు సంవత్సరానికి రాబడి ఎంత ?

ప్రకా : ఏదో అయిదువందలండి అదైనా కాగితం మీదనే మెరకభూములు - నిరు డురదవలు వచ్చి ముంపుడై పోయినాయి రైతువారీ గడుసుమీరిపోయింది; భూఖామందు ఖాతరేలేదు పోనీ దావాలు వేదామంటే మునసబ్ నాన్ బ్రామిన్ అయిపోయినాడు (నాలిక కొరుక్కొని) తమరు నాన్ బ్రామిన్సా ఏమిటి ? లేకుంటే బ్రామిన్సేనా ?

దొంగ . ఉ, నీ దగ్గర నగదు ఏ మాత్రం వుంది ?

ప్రకా : ఏముంటుందండీ, వున్న వాళ్ళం యిద్దరం కాని ఖర్చు చాలా జాస్తేనండి. అందులో నా భార్య దూబరామనిషండి - వెట్టి పీరు

దొంగ : సొమ్ము - నగదు - నీ దగ్గర ఏ మాత్రం వుంది ?

ప్రకా : చిత్తం చిత్తం - ఏదో దినవెచ్చానికి 5 - 6 వుంటుంది

దొంగ : చూపించు, తీసి చూపించు !

రాజ్యం : అమ్మో, అమ్మో !

దొంగ : నోరుమూసుకో నువ్వు రెచెడ్ ఉమన్

ప్రకా : అలాగేనండీ వట్టి దౌర్భాగ్యం మనిషి ! మేమేదో వ్యవహారం మాట్లాడుకుంటూ వుంటే నీ మూలుగేమిటి ? ఏమిటి కొంప మునిగిపోయింది ? ఆయన ఏదో అడుగుతున్నారు, నేనేదో చెప్తున్నాను

రాజ్యం : ఆ సందుగ పెట్టె చూపించండి. యిదిగో తాళం (తీసియిస్తుంది)

దొంగ (బాకు ఎత్తి) నీవు మాటాడావంటే యిది గుండెల్లోకి విసిరేస్తాను

ప్రకా : క్షమించండి, క్షమించండి నువ్వూరుకో (చెవులో మెల్లిగా) కానీ కానీ భయంలేదులే ఈ వేషం అంతాచూసి చేయవలసినపని ఆఖర్న చేసి వేస్తాను. నువ్వు పండుకో—మరి మాటాడదు లెండి ఆ సందుగ పెట్టె తెస్తునా ?

దొంగ : ఆ అయిరన్ సేఫ్ తియ్యవోయి

ప్రకా : కొంప ములిగిపోయింది రాజ్యం ! యినపపెట్టె కొననోయి కొననోయి అంటే కొనేదాకా ప్రాణం పుచ్చుకొన్నావు సరదా తీరిందా ?

దొంగ : ఏమి ?

రాజ్యం : తాళాలు పోయినాయండి

దొంగ : (ఆ మార్కండేయ పుస్తకము ఆమె మొగముపై కొడతాడు)

ప్రకా : ఉన్నాయండి, ఉన్నాయండి, కాని సరిగా తిరగడం లేదండి. అసలు వూళ్లో దొంగాటకంగా వుందని పెట్టె మూసి తాళాలు నూతులోకి విసిరేశానండీ-తర్వాత తీయించుకోవచ్చునని

దొంగ : (లేచి వాని రెక్క పట్టుకొని) రా. దిగు, దిగి తీయవలె, పద !

రాజ్యం : (దిగ్గున లేచి నమస్కరిస్తూ) మీధర్మమాయె ఆయనను దింపకండి ఆయన కీత రాదు కావలస్తే నన్ను తోసివేయండి నూతిలోకి - తాళం వెదకి తీసి నేను పైకి విసరివేస్తాను.

దొంగ : నువ్వితనికంటె వట్టి పేచీ మనిషిలాగున్నావే !

ప్రకా : పేచీ మనిషా ! యింకా పేచీ మనిషా ! ఈమెతో ప్రతిరోజునా నేనెంత బాధ పడిపో తున్నానో ఆ పరమేశ్వరుడికే తెలుసును. మహా మూర్ఖురాలు !

దొంగ : సరే, చప్పుడు కాకుండా పెట్టె బద్దలు కొట్టే సాధనం నా దగ్గిరవుంది నేను చూస్తా మరి మీ కీ పెట్టె మాత్రం ఎందుకూ పనికిరాదు.

రాజ్యం : బంగారం లాంటి పెట్టె. మొన్ననే కొన్నాం విరచే నివ్వకండి

ప్రకా : విరవకండి సార్ నాదగ్గర డూప్లికేటు కీసు వున్నవండి తీస్తా

దొంగ : తాళాలు దగ్గర పెట్టుకొనేనా యిన్ని వేషాలు వేశావు ? దొంగ దగుల్బాజీ ! తీయి· 10 గుంజీలు తీయి ముందు

ప్రకా : తమవంటి ఘరానా మనిషికి డూప్లికేటు కీసు యివ్వడామా అని

రాజ్యం : మొద్దు పిల్లకాయ లాగు గుంజీలు తీయడమేమిటి ? తీయవద్దు.

ప్రకా : ఆయన నోరు మూసుకో, నోరు మూసుకో అని చెప్పుతూ ఉంటే నీకా ? నాకా ? తీస్తానండి సార్, ముసుగేసుకో, ఆయనకు కోపం రాగలదు (లేస్తాడు)

దొంగ : ఇదిగో నేను తగుమనిషి తరహా చూపించేటప్పుడు, మీరు అల్లే వుండవలె, తెలిసిందా ? మీరు పశువుల్లాగా ప్రవర్తిస్తే మిమ్మ వేటాడే మార్గం నాకు తెలుసును ఇది 20 వ శతాబ్దం. ఎటువంటి ఘోరమైనా పాపమైనా కూడా నాజూకుగా జరగవలె నేను 20 వ శతాబ్దపు మనిషిని సజావుగా వ్యవహారం నడిస్తే నా లాభంలో నూటికి 80 చొప్పున కమీషన్ ఇస్తాను మీరు బైతుల్లాగు గగ్గోలెత్తితే మీ ప్రాణం వుచ్చుకొంటా. తెలిసిందా ? పెట్టె తియ్యి. ఒక్క ఇంటి కింతసేపు కూర్చుంటే ఎలాగవను ?

ప్రకా : చిత్తం, చిత్తం (తీసి) దయ చేయండి.

దొంగ : (వెళ్ళి చూచి) ఏం ? 5-6 వుందన్నావు

ప్రకా : అవునండి 5-6 అంటే 5-6 వందలన్నమాట.

దొంగ : అలాగా ... ... అవి ఒక కవరులో పెట్టు

ప్రకా : చిత్తం.

దొంగ : ఆ చిల్లర రూపాయలు ఎన్ని ?

ప్రకా : 13-15.

దొంగ : అవి నీ పై ఖర్చుకుంచుకో - తెల్లవారడమే డబ్బుకోసం ఎక్కడికి పోతావు గనుక. ఆ సామాన్లు తియ్యి - ఆ వెండి సామాన్లన్నీ.

రాజ్యం : అయ్యయ్యో ! ఎంతో ముచ్చటపడితే మొన్న మొన్ననే అన్నయ్య వీటిని బొంబాయి నుంచి పంపించేడండీ.

ప్రకా : ఆ కష్టపడిపోయినాడు పాపం మీ అన్నయ్య. 600 నేను పంపితే ఖర్చు పెట్టేసుకొన్నాడు కాబోలు. మరి నెల్లాళ్లకు పంపేడు. ఎంత కమీషన్ తీశాడో ?

దొంగ : మీ బావమరిదీ మీ భార్య లాగే పరమ దగుల్బాజీ లాగున్నాడే ?

ప్రకా · ఇంకా మెల్లిగా సెలవిస్తున్నారు దొంగ కదటండీ

దొంగ : సరే, వెండిసామానులు ఇత్తడి సామానులు ఎవరు మోసుకుపోతారు – నా కక్కరలేదు నేను యివ్వబోయే నూటికి 80 కమిషన్ కింద అవి మీరే వుంచుకోండి

రాజ్యం : మంచాలు, కుంచాలు, బిందెలు, చెంబులూ కూడా వదలివేస్తున్నారు కనుక అవీ కలిపి వేయండి 100 కి 100 కమీషనిచ్చిన గొప్ప మీకుంటుంది.

ప్రకా : ఇదే యిబ్బందండీ - ఏమి తెచ్చి యివ్వండి సంతృప్తి లేదు ఈ ప్రాణికి

దొంగ బంగారపు నగలు కనపడవేం ?

ప్రకా ఉన్నవేవో మై వైఫ్ వొంటిమీదనే వున్నవండీ, నిద్ర పోతున్నప్పుడైనా వాటిని తీయదండీ

రాజ్య అవేమాత్రం వున్నాయండి – కంటె వొడ్డాణం గొలుసు కూడ అమ్మివేశారండి

ప్రకా మరి ఇల్లు కట్టడానికి సొమ్ముచాలకపోతే అమ్మివేశానండి

దొంగ : కట్టించి కట్టించి అద్దె యిల్లు కట్టించారేమిటండి ?

ప్రకా : చిత్తం చిత్తం అమ్మివేయడమే మేలైంది అదైనా దక్కింది లేకుంటే –

దొంగ లేకుంటే ?

ప్రకా మరేంలేదు - తమరొస్తారని తెలియక అమ్మివేశాను తెలిస్తే వుంచివేద్దును. ఏదో అదీ ఇదీ కలిస్తే తమకు కొంత అదనుకు పనికివచ్చును అంటున్నా

దొంగ ఆవిడ వంటిమీద వస్తువులు అన్నీ తీయించి తీసుకరండి

రాజ్యం వేయి చెప్పండి లక్ష చెప్పండి పోతే నా ప్రాణమైనా పోనివ్వండి నే నివ్వను

ప్రకా చూడు ఆయనమాట కాదనకు ఆయన మనస్సు కరిగి – ఈ స్వల్ప వస్తువులు యివి మన కేమాత్రం అనితోచి ఆయనే వదిలేయవచ్చును ఈయన సామాన్యుడుకాదు 20 వ శతాబ్దం మనిషి ఈ కాలంలో ఈయన వొక్కడే

రాజ్యం నన్ను చిత్రవధ చేసినా సరే నే నివ్వనుగాక యివ్వను

ప్రకా ఏమండీ సార్ ! నూ వాళ్లివ్వమంటున్నారండి పీమేల్ ఎంతో మంచి పతివ్రత అయితేనే కాని తనవంటి మీద చెయ్యి వెయ్యనివ్వదండీ తమకు పెళ్లి అయినదండీ సార్ !

రాజ్యం , అయితే ఆవిడ ఎవరో మహా అదృష్టవంతురాలై వుంటుంది దొంగ పెళ్లామైన కావలె దొర పెళ్లామైనా కావలెనని

దొంగ ఏమిటి ఆలస్యం ? మొదట ఆ వస్తువులందుకో

ప్రకా ఏలాగునండీ ? మీరోసారి చెప్పి చూడండి

దొంగ . నా ప్రాప్తం – నేను ఆడదాన్ని నగలిమ్మని యాచిస్తానా లేకుంటే బాధిస్తానా ?

ప్రకా నేను సిగ్గుమాలి యాచించినా లాభం లేకపోయింది పోనీ కొంచం బాధించనా అండి నొక్కకపోతే మామిడి పండులోనుండి రసం రాదు

దొంగ (టైమ్ చూసి) 1–5 ఇంక నేను లేవవలె వేగంగా కానివ్వండి.

ప్రకా . రాజ్యం ! ఆయన్ని ఎంత వేగం పంపివేస్తే, మనకంత మేలు, ఇవ్వక తీరదులే

రాజ్యం ఇంక పోవడమే ! ఏదో చేయవలసినపని వీడికాఖర్న చేస్తామన్నారు మరచి పోయారా ఏమిటి ?

ప్రకా సమయం చూస్తున్నా ! ఇంకా వీడు పోయేవరకూ వేళ వుందిగా, మంచి ఉపాయం ఆలోచిస్తున్నా, ముందు సరకులు తీసి వీడి మొఖంమీద పార వేయి

రాజ్యం నేనేం వెర్రిదాన్ని అనుకొన్నారా ఏమిటి ? నేనివ్వనండీ ?

ప్రకా ఇవ్వకపోతే నీ గుడ్డేం పోయింది ? ఆడవాళ్లని బాధిస్తానా అని ఒతడనడంచేత నిన్నేమీ అనడన్న ధీమా నీకున్నది ఇక నేనెలాగు చస్తే నీకేం ? ఇవి నేను చేయించిపెట్టిన వస్తువులు కానీ, నీ యబ్బా, నీ తాత చేయించినవి కాదు

రాజ్యం (ఏడుస్తూ) తీసుకోండి, మీ వస్తువులు మీరు తీసుకోండి నాకక్కరలేదు (ఇస్తుంది)

ప్రకా (తెచ్చియిచ్చి) ఇవి యేమాత్రంలెండి తమవంటివారి కంటికి – తృణం

దొంగ నా జ్ఞాపకార్థం ఆవిడని ఈ జెడబిళ్ల వుంచుకోమనండి

ప్రకా చిత్తం, తమ జ్ఞాపకార్థం వస్తువు ఎందుకండీ తమరే చాలు, తమర్ని యీ జన్మలో మరవ గలనా అండీ

దొంగ అలాగుకాదు మరి నాలుగు రోజులు పోయిన తరువాత మరో దొంగ మీ ఇంటిమీద పడతాడనుకొండి అప్పుడు మీరు నన్ను ఎంచుకోవలె ఇందండి

రాజ్యం చాలు చాలు ఇంకా మా కొంప మీదికి దొంగల్ని తెచ్చిపెట్టకు ?

ప్రకా ఏమేవ్ ? ఊహూ ! స్నేహం దగ్గర విరోధం తెచ్చేటట్లున్నావు జాగ్రత్త

దొంగ అయితే నా పని పూర్తిఅయినట్లేనా ?

ప్రకా చిత్తం ఇంకేముంది ?

దొంగ : అదే అడుగుతున్నా (యింకేముందని నవ్వుతూ)

రాజ్యం అదిగో ఆయన వున్నారు కావలిస్తే తీసుకపోండి

దొంగ మంచిది, వెళ్లివస్తాను నాకు తాంబూలము యిప్పించివేయండి.

రాజ్యం ఇంకా అదికూడా మిగిలిపోయిందా ? (అసహ్యంతో కొరకొరా చూస్తుంది)

ప్రకా రా పిల్లా చప్పున రెండాకులు చుట్టు

రాజ్యం నా చేతకాదు అదుగో ఆకూ, వక్కా యివ్వండి చాలు

ప్రకా (మెల్లిగా) ఆకూ వక్కా యిచ్చేస్తే వెంటనే వెళ్లిపోతాడు మరొక్కక్షణం కూర్చోపెట్టి బాతాఖానీలో పెడితే నా తడాకా తెలిపిస్తాను (గట్టిగా) చుట్టు, బాగా చిలకలు చుట్టు

రాజ్యం (తల వంచుకొని ఆకులు చుడుతూ వుంటుంది)

దొంగ (కూర్చుండి) కానీండి అయిన ఆలస్యం ఎలాగూ కానే అయింది (రిస్టువాచీ చూచి) 1-25 అబ్బా! (సిగరేటు కేసులో నుండి తీసి అతని కొకటి యిచ్చి తానొకటి వట్టి అగ్గిపుల్ల వెలిగించి తొలుత అతని కందిస్తాడు)

రాజ్యం ఇదేమిటి? ఈయగ్గేమిటి? చేసింది చాలక కొంపమీదికగ్గి పెడుతున్నావా?

ప్రకా దొంగగారూ నేను సిగరెట్టు కాల్చుకొంటుంటే మధ్య నీ గగ్గోలు ఏమిటి? నీ పని నువ్వు చూసుకో చిత్తం. చిత్తం తమకు చాలా ఆలస్యమై పోయింది ఇక్కడ

దొంగ అయిపోయిందండీ! 1-30 ఇంక మరోచోటుకు వెళ్లడానికి వేళలేదు ఓపిక కూడా లేదండి అబ్బబ్బా 25 రోజులయింది నిద్ర అన్నది లేనే లేదనుకోండి శరీరం శుభ్రంగా చెడిపోయింది

ప్రకా వెధవది నైటు డ్యూటీ కష్టమేనండీ... .....

రాజ్యం పాపం ఎందుకింత కష్టపడిపోతున్నావేమిటి?

ప్రకా నువ్వు నోరు మూసుకో- మగాళ్లం మేమూ, మేము మాటాడుకొంటూవుంటే పానకంలో పుడకలాగు మధ్యదూరుతావు

దొంగ మాటాడనివ్వండి- నేను వచ్చిన పని అయిపోయింది గనక, ఇంక నన్ను ఒక పరిచితుడుగాను స్నేహితుడుగాను మీరు భావించవచ్చు.

రాజ్యం అయితే అడుగుతాను - ఈ పాడువృత్తి కాకుంటే యింతకంటే మంచి వృత్తి మీ కేమీ కనబడలేదూ?

దొంగ ఎంచేతనమ్మా యిది పాడువృత్తి అంటున్నావు?

రాజ్యం ఒకరి సొత్తు బలాత్కారంగా అపహరించడం పాపం కాదూ?

దొంగ ఒకరి సొత్తేమిటమ్మా తాను వచ్చేటప్పుడు తెచ్చాడా? పోయేటప్పుడు పట్టుకపోతాడా? అది మన సొత్తైతేనే మన దగ్గర కొస్తుంది ఋణం లేందే తృణమయినా ముట్టదంటారు ఈ ఊళ్లో యిందరు ధనవంతులుండగా నేనిక్కడకే ఎందుకు వచ్చాను? నా సొమ్ము యిక్కడ వుందిగనుక

రాజ్యం ఆ! నీయబ్బా నీ తాత గడించిన ముల్లె యిక్కడ దాచపెట్టేరు

ప్రకా ఇదిగో చెపుతున్నా - నోరు మూసుకో, తమరు సెలవిచ్చింది సత్యం

దొంగ : ఈ చుట్టుపట్ల మీకు తెలిసినవాళ్లలో ఎక్కువగా నగదు వ్యాపారంచేస్తూ పిసరూ పిప్పి బాగావున్నవాళ్లెవరైనా ఉన్నారా?

ప్రకా చిత్తం యిక్కడ 7 మైళ్ల దూరంలో శాంపురంలో జయంతివారని వున్నారు అర్ధరాత్రి వేళ అయినా అయిదు ఆరూ సంచులు కావాలంటే అక్కడే దొరుకుతుంది

రాజ్యం ఇక్కడకి యింతటితో చాలు మీ ధర్మమా అని వాళ్లకు కూడా సుడి పెట్టకండి

ప్రకా , వాళ్లు మన అత్తవారు లెండి పుట్టింటి అభిమానం కొద్దీ యిది యీలాగు దేవులాడుతూంది. సత్యం చెప్పవలసివచ్చేటప్పుడు మనిషి తన, పర అన్న భేదం చూపించకూడదు ఏమండీ ?

దొంగ · సరే రాసుకుంటా – శాంపురమా ? ఇంటిపేరు ఏమన్నారు ?

రాజ్యం : జోస్యులవారు

దొంగ . (వ్రాసుకొని) మీరు చెప్పినచోట నాకు దొరికే లాభంలో నూటికి ఐదు చొప్పున మీకు కమీషన్ యిస్తాను

ప్రకా భేష్ అయితే నానష్టం యిందులో కొంతకలిసి వస్తుంది పోయినడబ్బు పోయింది కానీ తమరు మా యింటికి దయచేయడం నా అదృష్టం ఇక నేను మీ కింద కమీషన్ ఏజంటుగా పనిచేస్తాను

రాజ్యం ఇంక ఈయనక్రింద ఉద్యోగమొక్కటే తరువాయి, యిదిగో తాంబూలం యింక ఆయన్ని అంపకం పెట్టిరండి

దొంగ (తాంబూలం పుచ్చుకొని) అబ్బా ! తల రింగురింగు మని తిరిగిపోతున్నది కాఫీ ఏస్పరిన్ గాని వుందా ?

రాజ్యం ఏమిటీ హిరణ్యాక్షవరాలు ? తెగూతెంపూ లేకుండా వుంది ఇదివుందా అదివుందా అని ఇంట్లో యింకేమి మిగిలున్నవో వరుసగా చెప్పివేస్తాను తినవలసినవి తినేసి, త్రాగవలసినవి త్రాగేసి, పట్టుకపోవలసినవి పట్టుకపో అటక మీద ఆవకాయ వుంది కుండలో చద్ది అన్నం వుంది

ప్రకా చాలు చాలు వూరుకో దాని మాటలకేమండి......వట్టి ఫిమేల్... కాఫీ ఏస్పరిన్ లేవు కాని థర్మాస్ ఫ్లాస్కులో తయారైన కాఫీ ఉంది ఓవల్టిన్ కావలిస్తే రెండు నిమిషాలలో స్టౌమీద తయారు చేయించేస్తాను

రాజ్యం చేయించేస్తారు ! నేను చేయను కావలిస్తే మీరే చేసుకోండి

ప్రకా అన్నట్లు స్పిరిట్ లేదు కదూ !

రాజ్యం అదివుంటే యీ ప్రారబ్ధమేమి ?

దొంగ · శ్రమెందుకులెండి - ఆ కాఫీ అందుకోండి (త్రాగి తాంబూలము వేసుకొని) అబ్బా ! లాభం లేదండీ మహా బాధగా వుంది అమృతాంజనం వుందా ?

ప్రకా లేదు నేను కొంచం ఆయుర్వేదవైద్యుడిని. ఒక్క మోతాదు మందు యిస్తాను పుచ్చుకోండి (లోని కేగును)

రాజ్యం ' (కొంచెము దూరముగా నిలిచి) నీ కింతటితో నైనా మమ్ములను అనుగ్రహించి విడిచి పోవాలనివుంటే పో. లేకుంటే నీకు యిక్కడ కేంప్ కాట్ వేస్తాను ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పండుకోండి. – అబ్బబ్బా! దొంగవాడు కూడా మాటలపోగూ, బాతాఖానీ రాయుడూ అయితే మహాబాధ.

(లోపలనుండి) రాజ్యం.

రాజ్యం ఆ వస్తున్నా (లోనికేగును)

దొంగ (తల వంచుకొని) ఎవరేమంటున్నదీ నాకు తలకెక్కడం లేదు. మందు తెప్పించండి (క్షణ మూరకుండి తల కొట్టుకొని బాధపడుతూ) ఏమండీ! నిద్రపోతున్నారా? ఇంకా తేరేం? (తెస్తారు)

ప్రకా ఇది కళ్లుమూసుకొని గుటుక్కున మింగెయ్యండి వెంటనే గుణమిస్తుంది.

దొంగ . ఒహో! మీరు కొంత పుచ్చుకోండి ముందు

ప్రకా . ఇది ఒక్క మోతాదేనండీ

దొంగ : ఈ మోతాదు ముందు మీరు పుచ్చుకోండి తర్వాత నాకిత్తురుగాని

ప్రకా . ఇది తల నొప్పి లేకుంటే వికటిస్తుందండీ.

దొంగ · (ప్రకాశం చేయి పట్టుకొని) నిజంచెప్పు ఏమిటీ మందు?

ప్రకా : క్షమించాలి నేను వద్దూ వద్దు అంటుంటే నాభార్య బలవంతపరచి ఈ మందు కలిపించిందండి.

దొంగ ఏమిటీమందు ?

ప్రకా మరేం లేదు. మత్తు మందు యిది పుచ్చుకొంటే రేపీ వేళకే తెలివి వస్తుంది.

దొంగ · ఛీ ఛీ, ఈ లోకంలో నమ్మదగినవారొక్కరూ లేరు

రాజ్యం : ఛా, ఛా – లోకంలో నమ్మకస్తు లెక్కడున్నారు – ఒట్టి దొంగలు తప్ప

దొంగ : యిందాక నీకు విడిచిపెట్టిన రూపాయలు యిచ్చివేయి – నీ అపరాధానికి 15 రూ. జరిమానా

రాజ్యం నువ్వు నిజంగా జడ్జీ లాగున్నావు కానీ దొంగలాగు లేవు.

ప్రకా : నువ్వు ప్లీడరులాగ లేవూ? చాలులే వూరుకో

(సొమ్మసిల్లాడు)

రాజ్యం : నా ప్లీడరీ మాటకేంగాని మీరున్నారులే నేరస్థుడులాగు.

ప్రకా : యిదేనండీ అల్లరి అసలు హజ్‌బెండ్ అంటే గౌరవం లేదండీ నువ్వు అంటే నువ్వు.

దొంగ : తలనొప్పి దుర్భరంగా వుంది ఒక గంట నిద్రపోతే సర్దుకుంటుంది పండుకొంటాను 1-50 సరిగా 3 గంటలకి నన్ను లేపివేయండి అలారం టైంపీసు వుందా ?

రాజ్యం : శ్రీరామచంద్రా ! యిది గంటలకొద్దీ ఆపరేషన్ లాగుంది–చిత్రవధ

ప్రకా : (తెచ్చి) మూడు గంటలకు అలారం పెట్టనా ?

దొంగ : పెట్టండి–యిదిగో అంతవరకూ మీరు మేలుకొని వుండండి

ప్రకా : (ప్రక్క సర్దుతూ) మీరు అంటే నేనొక్కడినేనా ? ఈమె కూడానా ?

దొంగ : మీ రొక్కరే (పండుకొని) మళ్లీ యీ సారి ఏమి ద్రోహం తలపెట్టినా చాలా చిక్కు పడిపోతారన్న సంగతి నేను చెప్పకుండానే మీరు తెలుసుకోవలసివుంది (క్షణం నిశ్శబ్దం)

రాజ్యం : అయితే ఈ శవజాగారం మీకు తెల్లవార్లూ వుందన్నమాటే ?

ప్రకా : (మెల్లగా) మాటాడమాక మధ్య గదిలోకి వెళ్లి పండుకో.

రాజ్యం : మీ కంత సరదాగా వుంటే నాకేం కానివ్వండి ఏమిటీ భాగవతం ? వీడి వ్యవహారంచూస్తే ఇల్లరికం వుండిపోయేటట్టు వుంది

ప్రకా : ఈయన ఇరవైయవ శతాబ్దపు మనిషి

రాజ్యం : అంటే ?

ప్రకా : అంటే ఆడవాళ్లు చదువులేనివాళ్లు మీకేమి తెలుస్తుంది ? మంచి ఘరానా మనిషిఅన్నమాట.

రాజ్యం : వీడెవడో నావల్సు దొంగలాగున్నాడు కానీ

ప్రకా : గట్టిగా మాట్లాడకు–నిద్రపట్టినట్లుంది నిజంగా నావల్సువల్ల సినిమాలవల్ల దొంగతనం మోస్తరు మారిపోయి, ఎంత నాజూకుగా తేలిందో చూశావూ ?

రాజ్యం : మోస్తరు మారితేనేం ? ఫలితం ఒకటే–1200 వరకు సుడిపెట్టాడు కదూ ?

ప్రకా : మెల్లిగా! నిద్రపట్టినట్టుంది

రాజ్యం : ఇదిగో నా మాట విని – ఈలాగు రండీ (దూరముగా తీసుక వెళుతుంది)

ప్రకా : మరి చెప్పకు నీ మాట నేను వినను అది వినబట్టే యింతైంది.

రాజ్యం : పోయిన 1200 ల కేండీ యీ జరిమానా 15 రూపాయిలకేనా విచారం ?

ప్రకా : లక్షపోతే విచారం లేదు కానీ మగవాడన్నవాడికి ఒక కానీ జరిమానా పడితే ఎంత పరువు నష్టం

రాజ్యం : మగతన మడగక్కరలేదు. ఈలాంటి మగవాళ్లుంటే రామసహాయం ! పెట్రోలింగ్ కు వెళ్లతారట ! దొంగల్ని పడతారట యిదంతా ఒక సరదా ఆటకానీ యింకేంకాదు మీరు యింత మనిషి వున్నారు – వీడు చూస్తే అర్భకుడు టక్కున నిలబెట్టేస్తే కోమటి ఆచిపెట్టి ఒక లెంపకాయ కొట్టలేక పోయినాడన్నారు. మీరు ఏమి చేశారు? కొనకి – గుంజీలు కూడా తీశారు సిగ్గు సిగ్గు

ప్రకా : వేశాను – ప్లాను వేశాను. సమయం చిక్కనీ ఏం చేస్తానో –

రాజ్యం : మొదటి నుంచీ అదేపాట పాడుతున్నారు కానీ చెయ్యడమే కనబడదు. బాగా నిద్ర పట్టింది నా మాట విని ఇప్పుడు వీణ్ణి ఈ మంచానికి కట్టి వేయండి. మరి నీళ్లు నమలక సాహసించండి.

ప్రకా : సాహసం లేక కాదు దొంగ యొక్క నిద్ర దొంగ నిద్ర. మన మేమైనా తొందరపడితే ప్రమాదిస్తుంది

రాజ్యం : యింతకంటే ఇంకా ప్రమాదమేమిటి ? కావలసిందేమో కానే అయింది దొంగా మనిషి వంటి వాడే వెచ్చగా కాఫీ త్రాగాడు చల్లగా నిద్రవచ్చింది వాడికి నిద్రాహారాలు కావలె. మనిద్దరం వట్టి చవటలమన్న సంగతి వాడికి బాగా తెలిసింది హాయిగా నిమ్మాచీగా పండుకొన్నాడు

ప్రకా : సవటలమేమిటి ? అసందర్భంగా మాట్లాడుతున్నావు

రాజ్యం : కాకుంటే మరేమిటి ? గుంజీలు, తియ్యమంటే గుంజీలు తీసేసి, జరిమానాలు కట్టమంటే జరిమానాలు కట్టేసి స్వాములవారికి సేవచేసినట్లు అడుగులకు మడుగులొత్తుతూ – ఛా ఛా మరీఇంత నాదారు మనుషులనుకో లేదు.

ప్రకా : ఈ చాదస్తమంతా ఎందుకు ? అయితే ఏం చెయమన్నావు ?

రాజ్యం నేను ముందర సాహసిస్తా చూడండి (వాని దగ్గర నుండి బాకు తీసి) దొంగను చంపితే గవర్నమెంట్ ప్రజంట్ యిస్తారని చెప్పారు. ఒక్క నరుకు నరకండి.

ప్రకా : నువ్వే చూడలేనన్నావు ?

రాజ్యం : అప్పుడు అలాగ అనిపించింది కాని – ఇప్పుడు, చిత్రవధచేసినా నాకు సంతోషమే ఏం పాపంలేదు. మరి నీళ్లు నమలకండి. (బాకిస్తుంది)

ప్రకా (క్రిందపెట్టి) అమ్మో వద్దు వద్దు. నిద్రపోతున్నప్పుడు నరకకూడదు – లేస్తూన్నాడు

రాజ్యం : లేదు. ఇటునుంచి అటు తిరిగి పండుకొన్నాడు పోనీ ఈ తాడుతో మంచానికి కట్టివేయండి. (తాడు తెచ్చి) ఈ మాత్రం చేయలేరా ?

ప్రకా : (ఆలోచించి) నేనొకటి చెప్తా – నువ్వు కట్టు తెలిసిందా ? వాడు లేచి నిన్నేమైనా అంటే నేను మధ్యపడతాను.

రాజ్యం ఏం మగతనమండీ ! పోనీ పోతే నా ప్రాణంకదా పోతుంది (మంచానికొక కొనకట్టి) నేను కడితే గట్టిగా వుండదు...... వెంటనే వదులేసికొంటాడు. మీరు కట్టండి – ఈ మాత్రం చేసె తప్పులేదు.

ప్రకా : ఈలాగుతే (తాడు పుచ్చుకొని దొంగ గుండెలపై ఎత్తి వేస్తాడు)

దొంగ : (దిగ్గున లేచి) దగుల్బాజీ – దగుల్బాజీ !

ప్రకా : (గజగజ వణికిపోతూ) క్షమించాలి క్షమించాలి (చప్పునపోయి భార్య రెక్క పట్టుకొని వచ్చి) 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అని దీని మాటవిని ఈ అపరాధంచేశాను. చుట్టుకొని తిరిగి పోతావేం నిలబడు

దొంగ : (ఒక్క గ్రుద్దు రాజ్యాన్ని గుద్ది) ఏమి నీ కిటువంటి పాడుబుద్ధి పుట్టింది?

రాజ్యం : (ఏడుస్తూ) నీ చేతులు పడిపోను నువ్వు నన్ను కొడతావట్రా? నీకు తల్లి లేదూ? అక్క చెల్లెళ్లు లేరూ? పెళ్లాం లేదూ? వాళ్లనెవరైనా యిలాగు......

ప్రకా : నీ కంతే కావాలి. నోరుమూసుకో. వెధవపని చేయించి మళ్లా ఏడుస్తావు!

రాజ్యం : అమ్మమ్మ! యేమిటీ ఘోరకలి! లోకంలో యింత చేతకానితనం కూడా వుంటుందీ. మగ వాడీమాత్రం కూడా పౌరుషంలేని, సవట అయిపోతే, ఇంక మొగుడనీ, మొద్దులనీ, పెళ్లనీ, పెడాకులనీ ఎందుకీ తంతు అంతా?

ప్రకా : అయ్యో! ఊరుకుంటుందో ఓ చెంపకాయ కొట్టమంటుందో అడగండి. ఏమిటా వేలావన?

దొంగ : (రాజ్యంతో) పో, లోపలికి పో, ఇంక నువు నా కంటి కగపడితే చూడు – పో

రాజ్యం : (ఏడుస్తూ లోపలికి పోతుంది)

దొంగ నువ్వు చేసిన నేరానికి నిన్నేమిచేస్తే తగిన శిక్ష అవుతుంది?

ప్రకా : నిలువుగా చీలిస్తే తప్పులేదు. ఇదుగో చెంపలు వేసుకొంటున్నా (వేసికొని) క్షమించండి కావలిస్తే 10 కాదు 100 గుంజీలు తీస్తాను (తీయబోతాడు)

దొంగ . గుంజీలు! గుంజీలు! నీకు వెయ్యి రూపాయలు జరిమానా వేశాను.

ప్రకా : అమ్మో అమ్మో ఎక్కడ తెస్తాను?

దొంగ ; కొంప వున్నదిగా పత్రం రాయి

ప్రకా ఇంటిమీద యిదివరకే అత్తెసరుగా అప్పున్నది.

దొంగ : బాకీటుతే (పుచ్చుకొని అది అతని గుండెలపై పెట్టి) వ్రాస్తావా?

ప్రకా : రాస్తాను. రాస్తాను. కాని ఇప్పుడు స్టాంపెక్కడనుంచి వస్తుంది?

దొంగ : నా దగ్గర వుంది యిందా – కాగితం కలం. ఇంకా మోసంచేస్తే ప్రాణానికే మోసం వస్తుంది. జాగ్రత్తగా రాయి.

ప్రకా : (రాసి) 1934 అక్టోబరు నెల తేది 15 విజయనగరం కాపురస్తుడు లేటు ద్వివేదుల చలమయ్య శాస్త్రిగారి కుమారుడు ద్వివేదుల ప్రకాశరావు — తర్వాత ఏమి వ్రాయమన్నారు?

దొంగ : రాయి. శాంపురం కాపురస్తులు –

ప్రకా : శాంపురం ! శాంపురం !

దొంగ : రాయి, జయంతి కృష్ణావధానిగారి కుమారుడు జయంతి కుటుంబశాస్త్రి ఉరఫ్ మాస్టరు కుట్టూ - రాయవోయి !

ప్రకా : (చూసి చూసి దిగ్గునలేచి) ఆరెనీసిగ తరగా. నువ్వేనటోయ్, రాజ్యం ! రావే ! రావే! మీ యన్నే ! కుట్టుగాడు !

రాజ్యం : (నవ్వుతూ చప్పున వచ్చి) అవునా అన్నయ్యా అయితే నువ్వేనా ? బ్రతుకు జీవుడా ! అయితే యీ వేషమంతా ఏమిటి ?

ప్రకా అదే నేను అడుగుతున్నా - అయితే ఈ పొయ్యేకాలం ఏమిట్రా ! (ఒక గ్రుద్దు గుద్ది) ప్రాణం పుచ్చుకొన్నావు. అయితే బొంబాయినుంచి యెప్పుడు వచ్చావు. ముందు ఒక ఉత్తరం లేదు. పత్రం లేదు.

దొంగ : యిదిగో - పత్రం రాయి రాయి.

ప్రకా : ఆ! రాస్తాను. రూ. 1000 లూ కొబ్బుక పోదుగాని (పత్రం చించి వేస్తాడు)

దొంగ అవును అయినవాళ్ల కిస్తావా - పరాయివాళ్లకు చేపుతావు కాని.

ప్రకా సరే నీ సంగతేమిటి చెప్పు. కూర్చోవే.

(ముగ్గురు మంచముపై కూర్చొంటారు)

దొంగ : ఏముంది! ఇప్పుడు సాగర్ మువీటోన్‌నుంచి - నియో ఇంపీరియల్‌లోకి మార్చేసుకున్నా. నీకాసంగతి వెండిసామాన్లు పంపినప్పుడు రాశానుగా !

ప్రకా : అవును - ఇప్పుడేం ఫిల్ము తీస్తున్నారు ?

దొంగ : "కాలాచోర్" అనే ఫిల్ము షూటింగ్‌లో వుండగా డైరక్టర్ చనిపోయినాడు. 55 రోజులు సెలవు తీసుకొని యింటికి వచ్చాను. 3 రోజుల క్రిందట - ఓమారు మా చెల్లెలును చూచి పోదాం అని వచ్చాను సాయంకాలం.

ప్రకా · అయితే ఆ ఫిల్ము తీస్తూ ఆ డ్రస్సులోనే వచ్చేశావా ఏమిటి ? లేకుంటే అది యిక్కడ ప్రాక్టీసు చేసుకొనవలెననుకొన్నావా ?

దొంగ లేదు లేదు రావడమే మా చెల్లి చెప్పింది. దొంగల్ని పట్టడానికి నువ్వు ప్రతిరోజూ ప్రాక్టీసు చేస్తున్నావని - పెట్రోలింగ్ అని రాత్రి తెల్లవార్లూ వూళ్లో తెగ తిరుగుతున్నావనీ-ఇంటిదగ్గర కూడా అవే కబుర్లుచెప్తూ ప్రాణం పుచ్చుకొంటున్నావనీ - అది విని నీ ధైర్య సాహసాలేమిటో మా చెల్లెలికి చూపిస్తామని

ప్రకా : అంటే నీ వేషమంతా దీనికి ముందే తెలుసు నన్నమాట ! ఇద్దరూ జోడించుకొని చేసిందే యీ పనంతా ? ఆరి మీ సాహసం మండా !

రాజ్యం . పెళ్లయిన యిన్నాళ్లకైనా మీ ధైర్యసాహసాలు నాకు తెలియవద్దా మరి ? ఈయన ఆంధ్రాషెర్లాకు హోమ్సట అన్నయ్యా – అంటే ఏమిటి ?

దొంగ ఆంధ్ర అంటే ఇమిటేషన్ అన్నమాట ఆ తర్వాత ఎంత గొప్ప పేరున్నా ఫరవాలేదు దాని శక్తిని ఇది ఆర్పేస్తుంది.

ప్రకా : మహంకాళీ ! నీ చాకచక్యం నిరుపమానం ఒక్కచోట, ఒక్కచోట తొణికావు కాదు కదా ? ఆశ్చర్యం ! నువ్వు చేసిందంతా నటనైతే వీడికంటే నీవే పైచేయి బావా ! ఇది సంసారిగాకంటె సినీమా నటిగా బాగా రాణిస్తుంది దీన్నికూడా నీతో తీసుకపోయి యే సాగరులోనో త్రొక్కివేయ్

దొంగ : నువ్వుకూడా రావాలోయ్ ఆ మహారాష్ట్రపు భోజనం ఏమీ సరిపడకుండా వుంది.

(లోపలనుండి – మిస్టర్ షెర్లాక్ హోమ్సు)

ప్రకా : వస్తున్నా !

దొంగ : ఎవరది ?

రాజ్యం : పెట్రోలింగ్ పార్టీ !

దొంగ : ఓహో ! దొంగల్ని పట్టే సంఘమా ? ప్రెసిడెంట్‌గారు వెళ్తున్నారా ? ఇదుగో ఈ పత్రం కూడా తీసుక వెళ్లండి

రాజ్యం : దొంగలకుకూడా పత్రాలు వ్రాసియివ్వడం మామూలు పెడితే ఇంక అడగ నక్కర్లేదు కావలిస్తే కొన్ని గుంజీలు తీసిరండి.

ప్రకా : మీకు బలే తమాషాగావుంది !

(శాలువ కప్పుకొని వెళ్తాడు)

రాజ్యం : ఏమిటన్నయ్యా ! ఏదోచెబితే ఇంతగల్లంతు చేశావేమిటి ?

దొంగ కొంపతీసి ఇదంతా మనసులో పెట్టుకుంటాడా ?

*రాజ్యం*· చాలా దర్జా హుందాగిరితనం గల **మనిషి**లే.

(ప్రకాశ**రావు** వస్తాడు)

*దొంగ :* ఏమిటి విశేషం? నువ్వు వస్తేకాని **దొంగ** దొరకనంటున్నాడావపటిదమి ? మీ పార్టీ నంతా ఓమారు చూపించావు కావే?

*ప్రకా :* (వెలవెలపోతూ) మా గొప్ప ఆట ఆ**డేశా**వుకదూ! ఏదీ షేక్‌హాండ్ ఈ**లాగు** పారేయ్! (చేయి పట్టుకొని) హల్లో మాస్టరు కుట్టూ!

*దొంగ :* (పంజా గట్టిగా నొక్కి) వెల్-ఆం**ధ్రా** షెర్లాక్‌హోమ్సు!

*రాజ్యం :* ఆ! ఆ! వదలీ వగలీ - (ఇద్దరి **చేతులూ** పట్టి నవ్వుతూ విడిపిస్తుంది)